క్లుప్తంగా

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగ చిన్నారికి బహుమతి అందజేస్తున్న ఐఈఆర్టీలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు ఐఈఆర్టీలు నూర్‌బాషా, మాలాబీ బహుమతులు అందజేశారు. అదేవిధంగా అంకిరెడ్డిపల్లెలో మారుతి దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రామచంద్రుడు, పెద్దిరాజు, చిరంజీవి, దస్తగిరి, ఎరికలప్ప, మద్దిలేటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సుబ్బరాయుడు

డోన్ టౌన్ : నంద్యాల జిల్లా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా డోన్‌కు చెందిన బీవై సుబ్బారాయుడు, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా సంజీవరాయుడు ఎన్నికయ్యారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని నిశాంత్ భవనంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి నాగమణి,రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక పూజలు



పాలపొంగళ్ల పూజలో పాల్గొన్న భక్తులు

బేతంచెర్ల: స్థానిక అమ్మవారి శాల్లో కార్తీక మాసం పురస్కరించుకొని సామూహిక గుర్రప్పస్వామి పాలపొంగళ్ల పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి సామూహిక పాల పొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బచ్చుసుబ్రమణ్యం, శేషఫణి, శేష మోహన్, బెసాని రమష్, లక్ష్మీనారాయణ,రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం చేరుకున్న మంత్రి అప్పలరాజు



మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల దర్శనార్థమై ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి డా.అప్పలరాజు శ్రీశైలం విచ్చేశారు. వీరికి భ్రమరాంబా అతిథిగృహం వద్ద దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సోమవారం ఉదయం మంత్రి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారని అధికార వర్గాలు తెలిపారు.

ఆటోను ఢీ కొట్టిన బొలెరో

అవుకు: మండల పరిధిలోని రిజర్వాయర్ సమీపంలో ఆదివారం ఆటోను బొలెరో క్యాంపర్ ఢీ కొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెర్లోపల్లె గ్రామానికి చెందిన పాములేటి తన ఆటోను రిజర్వాయర్ సమీపంలో ఓబులాపురం ఆర్చీ వద్ద క్లీనింగ్ చేసుకుంటున్నాడు. అటుగా వస్తున్న బొలెరో క్యాంపర్ ఢీ కొట్టడంతో పాములేటికి రక్త గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో క్షతగాత్రున్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల: పట్టణంలోని తహసీల్ పేట కాలనీకి చెందిన దిలీప్ కుమార్ (36) కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక అయ్యలచెర్వులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న దిలీప్ కుమార్‌కు భార్య శిరీష, ముగ్గురు సంతానం ఉన్నారు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం కుటుంబీకులు ఆదివారం ఉదయం పట్టణంలో వెతికారు. ఈ క్రమంలో పట్టణంలోని ఓ లాడ్జిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. లాడ్జి యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు.

అభివృద్ధి... అమోఘం!

- మారిన డోన్ పట్టణం రూపురేఖలు
- విశాలంగా మారిన రహదారులు
- సెంట్రల్ లైటింగ్ సిస్టంతో మెరుస్తున్న ద్రోణాచలం
- వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు



డోన్ పట్టణ నడిబొడ్డున మెరుస్తున్న నాలుగులైన్ల రహదారి



విశాలంగా మారిన రూరల్ పోలీసుస్టేషన్ రోడ్డు

డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లాలో డోన్ నియోజకర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ నియోజకర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన నేతలు అత్యున్నత పదవులు సైతం అలంకరించారు. అయినా అభివృద్ధికి ఆమడ దూరం అన్నచందంగా నిలిచిపోయింది. గ్రామాలతోపాటు పట్టణ ప్రజలకు సైతం కనీస మౌలిక వసతులు కరువయ్యాయి. ప్రత్యేకించి రోడ్లు మరీ అధ్వానంగా మారాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. డోన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అభివృద్ధికి బాటలు వేశారు. పట్టణాలతోపాటు పల్లెల

అభివృద్ధికి పకడ్బందీగా చర్యలు చేపట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు మంత్రి బుగ్గన అంకితభావంతో కృషి చేస్తున్నారు. అన్ని శాఖలకు సువిశాల నూతన భవనాల నిర్మాణంతో పాటు నాలుగులైన్ల రహదారులు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణం రూపురేఖలు మారిపోయాయి. ఇక్కడ ఉండి వెళ్లిపోయిన వ్యక్తులు ప్రస్తుతం వస్తే ఇది డోనేనా అనే సందేహం కలిగేలా డోన్ పట్టణం రూపుదిద్దుకుంది. దీంతో డోన్ నియోజకర్గం అభివృద్ధి అమోఘంగా ఉంటూ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా పట్టణాభివృద్ధి

డోన్ పట్టణం శరవేగంగా జరుగుతుంది. గడపగడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన పనులకు రూ.3.20కోట్లు, స్పెషల్ గ్రాంట్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన రూ.6.40కోట్లు, ఎమ్మెల్యే గ్రాంట్ కింద మంజూరైన మరో రూ.50లక్షలతో 32 వార్డులలో ప్రాధాన్యత క్రమంలో అభివద్ధి పనులు సాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 80 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. రూ.3కోట్లతో ఏడు పార్కులను అభివద్ధి చేశారు. వీటిలో స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, యోగా సెంటర్‌లు కూడా

ఏర్పాటు చేయబోతున్నారు. పట్టణమంతా డబుల్ రోడ్లు, నాలుగు లైన్ల రహదారులుగా విస్తరించడంతో ట్రాఫిక్ సమస్య తగ్గింది. పట్టణం అన్నివిధాలు అభివృద్ధి చెందుతుండడంతో అన్నివర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి బుగ్గనతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపుతున్నారు డోన్ పట్టణ ప్రజలు.



సెంట్రల్ లైటింగ్ సిస్టంతో కళకళలాడుతున్న డోన్ - కొత్తపల్లె రోడ్డు

● విశాలంగా నాలుగులేన్ రహదారి

రూ.9.40కోట్లతో ఫ్లైఓవర్ నుండి రూరల్ పోలీసుస్టేషన్ వరకు, యు కొత్తపల్లె నుంచి అమ్మ హోటల్ వద్దగల ఫ్లైఓవర్ వరకు నాలుగులేన్ రహదారి విశాలంగా దర్శనమిస్తుంది. అదేవిధంగా రూ.2కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సెంట్రల్‌లైటింగ్ సిస్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది నిర్మించారు. సెంట్రల్‌లైటింగ్ సిస్టంతో డోన్ పట్టణం మెరుస్తుంది. అదేవిధంగా డోన్ పట్టణం నుండి రాయలచెరువు వరకు రూ.40కోట్లతో డబుల్‌లైన్ నిర్మాణం జరిగింది. పట్టణంలోని ఉలిగమ్మ గుడి వద్ద నుండి హైవే వరకు రూ.4కోట్లతో, డోన్ - వెంకటనాయునిపల్లె, డోన్ - వెంకటాపురం, డోన్ - దొరపల్లె, డోన్ - బేతంచెర్ల వైపు రోడ్లనిర్మాణానికి దాదాపు రూ.50కోట్లు ఖర్చు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. దీంతో రహదారులు కళకళలాడుతున్నాయి.



ఆకర్షణీయంగా ఫ్లైఓవర్

ఆశ్చర్యంగా ఉంది...



మంత్రి బుగ్గన కృషితో డోన్ నియోజవకవర్గం అన్నివిధాలుగా అభివృద్ధి చెందుతుంది. ప్రత్యేకించి డోన్ పట్టణంలో జరిగిన అభివృద్ధిని తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇంత అభివృద్ధి జరుగుతాదని తామెప్పుడూ ఊహించలేదు. డోన్ నుంచి ఎంతోమంది రాజకీయంగా ఎదిగినా ప్రజలకు సరైన ప్రయోజనం చేకూరలేదు. పట్టణాన్ని అన్నివిధాలుగా తీర్చిదిద్దుతున్న బుగ్గనకు కృతజ్ఞతలు.

– శివరామకృష్ణ, న్యాయవాది, డోన్

ఊహించని అభివృద్ధి



డోన్ పట్టణంలో ఊహించని విధంగా అభివృద్ధి జరిగింది. ఇన్నేళ్లు వర్గ, వారసత్వ రాజకీయాలతో ప్రజలు మగ్గిపోయారు. గతంలో నేతలు స్వార్థ ప్రయోజనాలకు పాల్పడ్డారు తప్పా డోన్ పట్టణాన్ని సరిగ్గా పట్టించుకోలేదు. ఎమ్మెల్యేగా బుగ్గన గెలిచిన తర్వాతే డోన్ అభివృద్ధి బాట పట్టింది. మంత్రి అయ్యాకా ఊహించని రీతిలో పట్టణ ప్రజలకు మౌలిక వసతులు సమకూరాయి. బుగ్గన సాయం మరువం.

– మల్లికార్జున, స్థానికుడు

అభివృద్ధిలో అగ్రగామిగా డోన్



ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నారు. ప్రత్యేకించి డోన్ పట్టణాన్ని సుందరంగా తీర్చిద్దారు. రూ. కోట్లు వెచ్చించి పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కలిప్పించాం. ఇచ్చిన మాట ప్రకారం మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దేందుకు సహకరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సప్తశైల రాజేష్, మునిసిపల్ చైర్మన్, డోన్.

వ్యవసాయానికి ఈ వారం విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామమోహన్ చెప్పారు. కోవెలకుంట్ల, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల కింద జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. గుళ్లదూర్తి సబ్ స్టేషన్ పరిధిలోని పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు ఫీడర్లకు సంబంధించి ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

సంజామల: మండలంలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి పూట ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ దుర్గ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం, పేరుసోముల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ల విద్యుత్ సరఫరా వేళలను వివరించారు. సంజామల, ఆకుమల్ల, నొస్సం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, పేరుసోముల సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో ఫీడర్లకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఏఈ వివరించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్ : స్థానిక కోర్టు భవనం ఆవరణలో శనివారం నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్ తంగమణి ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం లోక్ అదాలత్ ఏర్పాటు చేస్తున్నామని, కక్షిదారులు ఇష్టం మేరకు రాజీ అవ్వడానికి పోలీసులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. పట్టింపుల మూలంగా జరిగే నష్టాన్ని వివరించి కక్షిదారులను చైతన్య పరచాలని సూచించారు.

ప్రశాంతంగా జాతీయ ఉపకార వేతనం పరీక్షలు

డోన్ టౌన్ : విద్యార్థుల్లో ప్రతిభవంతులను గుర్తించి వారి విద్యాభివృద్ధికి ప్రతి సంవత్సరం రూ.12వేల చొప్పున ఐదేళ్లపాటు స్కాలర్ షిప్ అందజేసేందుకు ఆదివారం నిర్వహించిన జాతీయ ఉపకార వేతనం(ఎన్ఎంఎంఎస్) పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని పాతపేట జెడ్పీ హైస్కూల్లో ఏ,బీ కేంద్రాలు, కొత్తపేట జెడ్పీ గర్ల్స్ హైస్కూల్లో ఏ,బీ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు చీఫ్ సూపర్‌వైజర్లుగా వెంకటసుబ్బారెడ్డి, మైమున్నీసా వ్యవహరించారు.

ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): బనగానపల్లె నియోజకవర్గ ఏపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నంద్యాల పట్టణంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల ఉపాధ్యక్షుడిగా హరినాథగౌడ్, పరిశీలకుడిగా రామచంద్రారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా బనగానపల్లె మండల అధ్యక్షుడిగా రామసుబ్బయ్య, ఉపాధ్యక్షులుగా మల్లికార్జునరావు, వీరయ్య ఆచారి లలితమ్మను ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, కార్యదర్శులుగా కుమార్‌బాబు, భాస్కరరావు, నాగసురేఖ ఎన్నికయ్యారు. సభ్యులుగా శ్రీరాములు, ఓబయ్య, హరినాథగౌడ్ ఎన్నికయ్యారని శివయ్య వివరించారు.

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

కోవెలకుంట్ల: తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధించడంతో ఆదివారం ఆ పార్టీ కార్యకర్తలు కోవెలకుంట్లలో సంబరాలు చేసుకున్నారు. ఆ పార్టీ బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలు యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ సర్కిల్‌లో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

డోన్ టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని పురస్కరించుకొని డోన్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. డోన్ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటిస్వామి, డీసీసీ కార్యదర్శి ఉన్నిగోర్ల జనార్దన్‌ల ఆధ్వర్యంలో స్థానిక పాతబస్టాండ్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



లక్ష్మీదేవితో బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ హరి



నరసమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ రామ్మోహన్‌రెడ్డి

ప్యాపిలి: పట్టణానికి చెందిన వృద్ధురాలు వడుగూరు లక్ష్మీదేవి కాలికి గాయం కావడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ హరి ఆదివారం కర్నూలుకు వెళ్లి ఆమెకు వితంతు పింఛన్ సొమ్ము రూ. 2,750 అందజేశాడు. బయోమెట్రిక్ తీసుకుని నగదు అందజయడంతో లక్ష్మీదేవి సంతోషం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

ప్రొద్దుటూరుకు వెళ్లి...

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొల్ల నరసమ్మ వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో కంటికి ఆపరేషన్ చేయించుకొని అక్కడే ఉన్న కూతురు ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుంది. వలంటీర్ రామ్మోహన్‌రెడ్డి ఆదివారం ప్రొద్దుటూరుకు వెళ్లి నరసమ్మకు వితంతు పింఛన్‌కు సంబంధించి బయోమెట్రిక్ తీసుకొని పింఛన్ సొమ్ము అందజేశాడు. దీంతో నరసమ్మ వలంటీర్‌తోపాటు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్ : ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ సురక్షిత డ్రైవింగ్ చేసినప్పుడు ప్రయాణికులు క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటారని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని మధు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, ఆటోల రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్సు తప్పని సరిగా కలిగి ఉండాలన్నారు. ఆటోలను నడుపు సమయంలో జాగ్రత్తలు వహిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, ఇతరులకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా వ్యవహరించాలన్నారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డ్రైవర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు గోపాల్, భాస్కర్, రామసుబ్బారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సమాజ సేవలో కీలకం



బేతంచెర్లలో శేషారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

బేతంచెర్ల: సమాజ సేవలో రెడ్డి సామాజిక వర్గాల పాత్ర కీలకమని, అన్నివర్గాల సంక్షేమానికి తోడ్పాటునందించే నైజం మన సొంతమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కుంట నరేష్ రెడ్డి, విద్యా సంస్థల అధినేత కేవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శిరిడీ సాయిబాబా ఆలయం ఆవరణలోని రేగటి బాల వెంకట రెడ్డి గోవిందమ్మ కల్యాణ మండపంలో మండల రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉసిరిక చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బేతంచెర్ల పట్టణానికి ముందు చూపుతో బడి, గుడి, వైద్యశాల, పశువైద్యశాల, కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేసిన రావు బహదూర్ బీపీ శేషారెడ్డి విగ్రహానికి పూలమాలలవేసి అయన సేవలను కొనియాడారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వడ్డెరులు రాజకీయంగా ఎదగాలి



పట్టణంలో ర్యాలీ చేస్తున్న వడ్డెరులు

డోన్ టౌన్ : వడ్డెరులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కదిరి వెంకటేశ్వర్లు, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భక్తుల లక్ష్మీకాంతయ్య, వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం డోన్ పట్టణ సమీపంలోని పేరంటాలమ్మ గుడి వద్ద ఉన్న వడ్డెర కమ్యూనిటీ భవనంలో జరిగిన కార్తీక వన భోజన మహోత్సవానికి వారు హాజరయ్యారు. ముందుగా పట్టణంలో డోన్ వడ్డెర సంఘీయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉసిరిక చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వడ్డెరులను ఎస్టీల జాబితాలో చేర్చాలని, 45 ఏళ్లు నిండిన వారికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. మహిళలకు కర్నూలుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వర టెక్స్‌టైల్స్ యజమాని సుబ్బారాయుడు దంపతుల చేతుల మీదుగా పసుపు, కుంకుమ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టరు రామసుబ్బయ్య, వడ్డెర నాయకులు వెంకటేశ్వర్లు, చక్రధర్, మద్దిలేటి, నాగరాజు, రంగస్వామి, లక్ష్మన్న, రమణ, సురేష్, రామశివుడు, సూర్యచంద్రుడు, సోమన్న, వెంకట్రాముడు, శివ, రఘు, అంజి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వనభోజనం



శ్రీరామమోహనమురళీ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని అవుకు రోడ్డులో ఉన్న శ్రీషిరిడీ సాయినాథ్ ఆలయ ఆవరణలో ఆర్యవైశ్య కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీషిరిడీ సానాయినాథ్ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆటల పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీరామమోహనమురళీ సహకారంతో అన్నదానం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమానికి సహకారం అందజేసిన దాత శ్రీరామమోహన మురళీ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాధంశెట్టి వేనుగోపాల్, ప్రధాన కార్యదర్శి శ్రీరామవెంకట సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ సముద్రాల చక్రపాణి, శాశ్వత గౌరవ అధ్యక్షుడు పీఎస్ఎస్ నారాయణ, నాయకులు నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయ్‌కుమార్, రామకృష్ణ, కాసుల జంగంశెట్టి,డి వెంకట సుబ్బయ్య, గుండా రవికుమార్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, జక్కానాగరాజు, బచ్చు రమేష్‌గుప్త, బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల ముస్తాబు



పట్టణంలోని రవ్వలకొండ పై రూ.1.53 కోట్లతో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు

బనగానపల్లె : బనగానపల్లె పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.1.53 కోట్లు వెచ్చించి 2.50లక్షల లీటర్ల సామర్థ్యంరవ్వల కొండపై, రూ.1.19 కోట్లతో 2.50లక్షల లీటర్ల సామర్థ్యంతో ఎన్జీఓ కాలనీలో నిర్మించిన ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు నిర్మించారు. బనగానపల్లె పట్టణంలో త్రాగునీటి సమస్య తీర్చేందుకు జల్‌జీవన్ పథకం ద్వారా వీటిని అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పుపైప్లైన్ల ద్వారా ట్రైల్‌రన్‌ను అధికారులు నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా జరిగినట్లు అధికారులు తెలిపారు. పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువ తీసుకున్నారని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్ రెడ్డి పేర్కొన్నారు. త్వరలో ట్యాంక్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.



ఎన్జీఓ కాలనీలో 1.19 కోట్లతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు

బలిజలు ఐకమత్యంగా మెలగాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

● ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: బలిజలు ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రం అవుకు సమీపానున్న శ్రీ కాశీవిశ్వనాథ స్వామి ఆలయం వద్ద అవుకు బలిజలు నిర్వహించిన కార్తీక వనభోజన కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు యువనాయకుడు కాటసాని ఓబుల రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అవుకు మండలంలో బలిజలు అత్యధికంగా ఉన్నారని, రాజకీయాల్లోనూ తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. బలిజల అభివృద్ధికి తమవంతు సహకారం అందజేస్తామని, ఇప్పటికే రూ.1.20 కోట్లతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామయ్య, ఈఓ అశ్విన్ కుమార్, బలిజ సంఘం నాయకులు రామన్న, కిట్టన్న, నారాయణ, దంతెల రమణ, వేటూరి రమణ, మధు, ప్రసాద్, వెంకటేశ్వర్లు, శివన్న, శ్రీరాములు, కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లు, పార్లమెంట్ అధ్యక్షులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.